క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత


నగదు అందజేస్తున్న సభ్యులు

దేవరకొండ : పట్టణానికి చెందిన అబ్దుల్ రషీద్ ఆటో నడుపుతూ కుటుంబంతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. ఎనిమిది నెలల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో రషీద్ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ దేవరకొండ సభ్యులు సోమవారం రషీద్ కుటుంబ సభ్యులకు రూ.13వేలు ఆర్థిక సాయం అందించడంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అన్వేష్, నరేష్, సాయి, అజయ్, కృష్ణ, మణిదీప్, రమేష్, రిషి పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి సామూహిక వ్రతాలు


శ్రీసాయిదత్తా ఆశ్రమంలో పూజలు చేస్తున్న భక్తులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని శ్రీసాయిదత్తాశ్రమంలో సోమవారం సత్య సాయి సామూహిక వ్రతాలను నిర్వహించారు. పట్టణ పరిసరాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి వ్రతాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గుండా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరేందర్, ఉపాధ్యక్షులు ప్రతాఫ్, మట్టయ్య, సోమన్న, జానకిరాములు, శ్రీనివాస్, జంగారావు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి పవర్‌ప్లాంటులో స్థానికులకు ఉద్యోగాలివ్వాలి

మిర్యాలగూడ టౌన్ : యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవర్ ప్లాంట్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఉద్యోగమివ్వలేదన్నారు. వెంటనే యాదాద్రి పవర్ ప్లాంట్‌ను మూసివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించలేదని, కాలుష్యానికి సంబంధించిన మొక్కలను కూడా నాటలేదన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు నిరంజన్, శ్రీకాంత్, శరత్, రాజు, భీమారాజు, వెంకటేష్ తదితరులున్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ఆలయంలో పూజలు చేస్తున్న బ్రాహ్మణులు

నాగార్జునసాగర్ : హిల్‌కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలు 23వ తేదీవరకు నిర్వహించనున్నారు. ఆదివారం అంకురార్పణ చేయగా సోమవారం యాగం నిర్వహించారు. నిత్యం ఉదయం, సాయంత్రం కార్యక్రమాలు జరుగుతున్నట్లుగా ఆలయ కమిటీ చైర్మెన్ మేరెడ్డి నారాయణరెడ్డి, పూజారులు తెలిపారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రభావతి

నల్లగొండ టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్య, వైద్యం ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించాలన్నారు. దేశంలో మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు పోలెబోయిన వరలక్ష్మీ, కొండా అనురాధ, పద్మ, అరుణకుమారి, నాగమణి, గోవర్ధన, ధనలక్ష్మీ, గోలి వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

- మరమ్మతులకు నోచుకోని రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- ప్రస్తుత ప్రభుత్వంలోనైనా మరమ్మతులు చేయాలని కోరుతున్న ప్రజలు


గుంతలమయంగా మారిన కాపువారి గూడెం రోడ్డు


రూప్లా తండా వద్ద కంకర తేలిన బీటీ రోడ్డు

త్రిపురారం : మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. 40ఏళ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి జానారెడ్డి తండాలను కలుపుతూ బీటీ రోడ్లు వేయించారు. కానీ పదేళ్ల కాలంలో గత ప్రభుత్వం మండలంలోని రహదారులను పట్టించుకోలేదు. మరమ్మతులకు నోచుకోక పలు చోట్ల భారీ గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వాహనాదారులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. మండలంలో ఎక్కువగా గిరిజన జనాభా ఉండడంతో గత ప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. కానీ ఆ తండాల్లో మౌలిక వసతుల కల్పనకు పూనుకోలేదని ఆయా తండావాసులు పేర్కొంటున్నారు. వర్షాలు వచ్చినప్పుడు రోడ్లపై పడిన గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండి ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. 10 ఏళ్ల తరువాత తిరిగి సాగర్ నియోజక వర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీగా కూడా రఘువీర్‌రెడ్డి ఉండడంతో పాటు ఆర్‌అండ్ బీ మంత్రిగా నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి ఉండటంతో గ్రామీణ రోడ్లు పూర్తయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

హద్దులు కోల్పోతున్న రోడ్లు

మండలంలో ఉన్న రహదారులు హద్దులు కోల్పోతున్నాయి. అయితే డాంబర్ రోడ్డు నిర్మించిన తరువాత ఆర్‌అండ్‌బీ శాఖ నిబంధనల ప్రకారం రోడ్డుకు ఇరువైపులా బార్డర్‌ను ఏర్పాటు చేస్తారు. దీంతో భూముల ధరలు రోజు రోజుకు పెరిగిపోతుండడంతో రోడ్డుకు సమీపంలో ఉన్న పొలాల రైతులు ఆర్‌అండ్‌బీ భూమిని తవ్వి పొలాలల్లో కలుపుకుంటున్నారు. ఆర్ అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో కొన్ని రోడ్ల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు పాసింగ్ కావడం లేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు మండలంలోని అన్ని లింక్ రోడ్లను పరిశీలించి ఆక్రమించుకున్న రోడ్డు భూములకు హద్దురాల్లు ఏర్పాటు చేయాలాని ప్రజలు కోరుతున్నారు.

గుంతలమయమైన రహదారులు వివరాలు..

దుగ్గెపల్లి నుంచి జీఅన్నారం వరకు బీటీ రోడ్డు లేదు. కేవలం ఆయా గ్రామాల ప్రజలు మట్టి రోడ్డు పైనే ప్రయాణం చేయాల్సి వస్తుంది. కామరెడ్డి గూడెం నుంచి కంపాల పల్లి మీదుగా మునగబావి గూడెం వరకు రోడ్డు గుంగతలమయంగా మారింది. ముకుందాపుంర నుంచి కంపాసాగర్ వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. త్రిపురారం ప్రధాన సెంటర్ నుంచి సత్యనారయణ పురం, నీలాయి గూడెం, అంజనపల్లి, పాల్తి తండా మీదుగా రాగడప సబ్ స్టేషన్ వరకు, త్రిపురారం నుంచి బెజ్జికల్, మ్రటిగూడెం, పలుగు మీదుగా చెన్నాయి పాలెం ఎక్స్ రోడ్డు అస్తవ్యస్తంగా తయారైంది. చెన్నాయిపాలెం నుంచి అల్వాల పాడు, సత్యం పాడు తండా మీదుగా వస్తం తండా వరకు, రాగడప బ్రిడ్జి నుంచి రూప్లా తండా, అప్పలమ్మగూడెం, లోక్యా తండా, మంగళి తండాలను కలుపుతూ బో్ర్రాయి పాలెం వరకు రోడ్డు నిర్మించాల్సి ఉంది. రాగడప బ్రిడ్జి నుంచి డోంక తండా మీదుగా బడాయి గడ్డ గ్రామ పంచాయతీ వరకు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతులు ఏర్పాడ్డాయి. ఆరగడప గ్రామ ప్రధాన సెంటర్ నుంచి పలుగు తండా, కాపువారి గూడెం, లచ్య తండా, కుంకుడు చెట్టు తండా గ్రామాలకు లింక్ రోడ్డుల నిర్మించాల్సి ఉంది. సాగర్ నియోజకవర్గం త్రిపురారం మండలం కాంగ్రెస్ కంచుకోటలాగా నిలిచింది. మండల నాయకులు గ్రామీణ రోడ్ల పరిస్థితిని ఎమ్మెల్యే , ఎంపీ దృష్టికి తీసుకెళ్లి రహదారులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇప్పటికీ జానారెడ్డి వేసిన రోడ్లే



మండలంలోని గ్రామాలకు జానారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు వేసిన రోడ్లే ఇప్పటికీ ఉన్నాయి. 10 ఏళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మండలంలో ఏ ఒక్క రోడ్డు కూడా వేయలేదు. గ్రామ పంచాయతీలను తండాలుగా మార్చింది కానీ రోడ్లను పటిచుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. అవసరమైన చోట నూతన రోడ్లను నిర్మించాల్సి ఉంది. ఈవిషయాన్ని ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం.

– ధనావత్ భారతి, జెడ్పీటీసీ

ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్తాం



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుంది. మండలంలో చిన్న గ్రామ పంచాయతీలను ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి సహకారంతో అభివృద్ధి చేయిస్తాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లుగా గ్రామీణ రోడ్లను పట్టించుకోకపోవడంతో గ్రామీణ రోడ్లు అద్వనంగా మారాయి. మండలంలోని గ్రామాలు, తండాలకు అవసరైన చోట నూతన రోడ్లు నిర్మించే విధంగా జానారెడ్డి, ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల చేయించి అభివృద్ధి చేస్తాం.

– అనుముల పాందమ్మ, ఎంపీపీ, త్రిపురారం

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి


మట్టిరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : బీఆర్ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని బోయగూడెం గ్రామంలో సీడీపీ నిధుల ద్వారా మంజూరైన రూ. 15లక్షల మట్టిరోడ్డు పనులను సోమవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు రోజు రోజుకు నమ్మకం పోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేకుంటే ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు, నాయకులు కృష్ణారెడ్డి, కూన్‌రెడ్డి లింగారెడ్డి, మాలే సత్యంరెడ్డి, పొదిల మల్లయ్య, మండల శ్రీనివాస్, జలేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, సత్యం రెడ్డి, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తా


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్


కొండమల్లేపల్లి : పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

- ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. చందంపేట మండలంలోని తెల్దేవర్‌పల్లి గ్రామంలో సీసీ రోడ్డు, ఆర్చి నిర్మాణానికి ఆయన సోమవారం భూమి పూజ చేసి మాట్లాడారు. చందంపేట మండలం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని అన్నారు. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు జాలె నర్సింహారెడ్డి, కొండ్ర శ్రీశైలంయాదవ్, ఎంపీపీ పార్వతిచందునాయక్, కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు జర్పుల బద్యానాయక్, జెడ్పీటీసీ బుజ్జిలచ్చిరాం, జైపాల్‌రెడ్డి, మహాలక్ష్మయ్య, అర్జున్ సింగ్, కిన్నెర హరికృష్ణ, శవ్వ నారయ్య, లక్ష్మణ్‌నాయక్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

కొండమల్లేపల్లి(చింతపల్లి) : దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం చింతపల్లి మండలంలోని వింజమూరు గ్రామ శివారులోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భవాని, నాగభూషణం, యాదిగౌడ్, సంజీవరెడ్డి, హరినాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

కొండమల్లేపల్లి : విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన డీఆర్ అకాడమీ కళాశాలను ఆయన ప్రారంభించి యజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను కళాశాల యజామాన్య సన్మానించింది. ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఎంపీటీసీ రాణిరాజు నాయక్, రాంసింగ్, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, గంధం సురేష్, యేకుల సురేష్ పాల్గొన్నారు.

రథయాత్రను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

దేవరకొండ : కూకట్‌పల్లి ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో జూలై 10న దేవరకొండలో నిర్వహించనున్న పూరిజగన్నాథ్ రథయాత్రను విజయవంతం చేయాలని ఆ రథయాత్ర కమిటీ అధ్యక్షుడు చీదెళ్ల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రథయాత్ర ప్రచార పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు.రథయాత్ర నేపథ్యంలో నిర్వహించాల్సిన ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో సమీక్షించారు. దేవరకొండ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నక్క వెంకటేష్‌యాదవ్, నాగేశ్వర్‌రావు, ఆలంపల్లి నర్సింహ, పున్న వెంకటేశ్వర్లు, తాడిశెట్టి సుదర్శన్, వాస వెంకటేశ్వర్లు, నీలా సంజీవ్‌కుమార్, శ్రవణ్, శ్రీరాములు, జయలక్ష్మి పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

మిర్యాలగూడ టౌన్ : అడవిదేవులపల్లి మండలం జిలకరకుంటతండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రమావత్ రూప్లా ప్రమాదవశాత్తు తేలు కాటుకు గురై మృతి చెందాడు. రూప్లాకు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉన్నందున పార్టీ ప్రమాద బీమా మంజూరైంది. సోమవారం ఆ చెక్కును మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, శాసనమండలి చైర్మన్‌తో కలిసి ఆ మృతుడి కటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రమాదవ శాత్తు పార్టీ కార్యకర్త మృతి చెందితే ఆ కుటుంబానికి పార్టీ అన్నీ విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, నల్లగొండ జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దామరచర్ల జెడ్పీటీసీ అంగోతు లలిత హాతిరాంనాయక్, అడవిదేవులపల్లి ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, పకీరానాయక్, హుస్సెన్, ఇలియాస్ తదితరులున్నారు.

ముగిసిన గీతామందిర్ బ్రహ్మోత్సవాలు


గీతామందిర్‌లో స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న పురోహితులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని గీతామందిర్ (గోవింద క్షేత్రం) శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. సోమవారం మహాపూర్ణాహుతి, చక్రస్నానం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మహాపూర్ణాహుతి, చక్రస్నానం మహోత్సవంకు పట్టణ పరిసరాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. చివరి రోజు బ్రహ్మోత్సవాలు కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం యాగశాల చుట్టూ భక్తులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అలయ కమిటీ అధ్యక్షులు బండారు కుశలయ్య మాట్లాడుతూ ఐదు రోజుల పాటు నిర్వహించిన ఈ బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరైన వారికి, భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైతులను గందరగోళానికి గురిచేయొద్దు

హుజూర్‌నగర్ : రుణమాఫీ, రైతుబంధు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధన తీసుకొచ్చి రైతులను గందరగోళానికి గురి చేయవద్దని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాల్సిందేనని పేర్కొన్నారు. రైతుల హక్కులను కాపాడుతూనే కౌలు రైతులకు న్యాయం చేయాలని సూచించారు. కౌలు రైతుల ప్రయోజనాల కోసం ఇన్‌పుట్ సబ్సిడీ, తక్కువ ధరకు ఎరువులు అందిస్తూ ధాన్యానికి గిట్టుబాటు ధరను కల్పించడం వల్ల వారికి న్యాయం చేయవచ్చని తెలిపారు.

లక్ష్మయ్యకు జాతీయ స్థాయి పురస్కారం

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని రాంనగర్‌కు చెందిన పతాంజలి యోగా నిర్వాహకుడు పాలిశెట్టి లక్ష్మయ్యకు జాతీయ పురస్కారం అందజేశారు. ఈనెల 16న వరంగల్‌లో తెలుగు సాంస్కృతిక సాహితీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ సాంస్కృతిక సాహితీ బుక్ ఆఫ్ రికార్డులో భాగంగా లక్ష్మయ్యను పురస్కారం అందజేసి సన్మానించారు. ఈసందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ జాతీయ స్థాయి పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. పురస్కారంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. జాతీయ స్థాయికి తనను ఎంపిక చేసుకున్న ట్రస్టుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

దేవరకొండ : ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్ల సురేష్ అన్నారు. సోమవారం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో అంతర్జాతీయ కరాటే దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ శ్రీనుతో కలిసి ఆయన కేక్ కట్ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జగన్, ఉమామహేష్, తదితరులు పాల్గొన్నారు.


దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవన్‌లో కేక్ కట్ చేస్తున్న సురేష్, తదితరులు

బీసీల రాజకీయ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

మఠంపల్లి : బీసీల రాజకీయ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాల ధనుంజయ నాయుడు కోరారు. సోమవారం మఠంపల్లి మండల కేంద్రంలో ఆ సంఘం నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జనాభాలో 12 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీల రాజకీయ రిజర్వేషన్లకు చట్టబద్ధత ఉందని.. కానీ జనాభాలో 56 శాతం ఉన్న బీసీల రాజకీయ రిజర్వేషన్లకు చట్టబద్ధత లేదన్నారు. కేవలం బీసీల మధ్య ఐక్యత లేకపోవడం మూలంగానే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్య,వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు రావులసత్యం,ఏఐటీయూ జిల్లా నాయకుడు ఊదరవెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ


మంత్రికి మొక్క అందజేస్తున్న కళ్యాణ్ చక్రవర్తి

నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్రానికి సోమవారం వచ్చిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కళ్యాణ్ చక్రవర్తి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లాలో సీజనల్ వ్యాధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు ప్రజారోగ్యంపై సమీక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో జె.శేఖర్‌రెడ్డి, బైరగోని భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు


డిండి : ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


పెద్దవూరలో..


ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు


త్రిపురారం : ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసులు


మిర్యాలగూడ టౌన్ : బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , తదితరులు


దేవరకొండ : ఈద్గా వద్ద ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు


దేవరకొండలో..


అడవిదేవులపల్లిలో..


కొండమల్లేపల్లి : ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు